# రాతిదేవుడు

జయంతి పాపారావు

'ఎల్లనా, మాననా....' అనుకున్నాడు ఎంకట సామి. ముందు నుయ్యి - వెనక గొయ్యిలా ఉంది వెంకటస్వామికి. ఎలాంటి చావు కావాలో కోరుకో మన్నట్లుంది వెంకటస్వామికి. 'దేవుడా! దేవుడా!! ఎల్లనా మాననా....'అని వెంకటస్వామి దేవుణ్ణే అడిగాడు.

ఆ దేవుడు రాతిదేవుడు. శిల్పి చేతుల్లో సొంపులు దిద్దుకున్న దేవుడు. ఆ దేవుడు విలాసంగా చిరునవ్వు నవ్వుతాడు. ఉల్లాసంగా కొంటె చూపులు చూస్తాడు. ఆ వెంకటస్వామికి ఏమీ సలహా యివ్వలేదు.

దేవుడు! దేవుడు!! ఏడీ దేవుడు ఏడీ? ఎక్కడున్నా డెక్కడున్నాడు? ఎక్కడాలేడు? ఎక్కడా లేడా? చేసిన అవకతవకల సృష్టికి చింతిస్తూ మంచం పట్టేసే దేంటి దేవుడు? కనబడితే ఈ జగతిని కదపారాసి ఇచ్చి సంచులు సంచులు గుమ్మరించి ఎవడైనా అడ్డుకుంటాడని ఎక్కడ నక్కేడో ఏంటో?! మన దేవుళ్ళకి పెళ్ళాలూ ఎక్కువే. ప్రేయసులూ ఎక్కువే. అంచేత, ఏ గుంటో కొంగు ముడేసి కదలకుండా కూకుందో ఏంటో?! లేదా. ఏ గుంట తగూలోనో ఇరుక్కుని గెడ్డాలూ మీసాలూ పెంచేసి కోర్టులంట తిరుగుతున్నాడో ఏంవో? లోకంలో పాపాన్ని రూపుమాపడానికి ఏ కొండ గుహల్లోనో కష్టాలకు పదును పదుతున్నాడో ఏంటో? దేవుడు! దేవుడు!! ఎక్కడున్నాడు? ఎక్కడా లేడు? ఎక్కడా లేడా? అని కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్న వెంకటస్వామి అప్పుడు అనుకోకుండా ఉండలేకపోయాడు.

"ఎల్లాలి. ఎల్లక తప్పదు" అని వెంకటస్వామి అనుకున్నాడు.

*　　*　　*

వెంకటస్వామి ముసిలెడ్లకు నీళ్లు పెట్టి ఇంటి ముఖం పట్టాడు. నాలుగు వందల గుండ్రని ఒంటి గది మట్టిమిద్దె ఇళ్లున్న అ వూరిలో ఉత్తరాన్న ఉన్న ఆఖరి ఇల్లు వెంకటస్వామిదే. ఆ వూరికి పెద్ది కూడా అతడే. ఆ ఇంటి తాటాకులు బాగా ఎండిపోయి, నల్లబడి, రేకులు రాలి పోతున్నాయి. ఎండ ఇంట్లోకి చొరబడుతూనే ఉంది, చోడి చొప్ప ఇంటి మీద పరిచి రెండు సంవత్సరాల నుంచీ కాలక్షేపం చేస్తున్నాడు. వెదుళ్ళముళ్ళు బిగి



తప్పి కిందకు జారిపోతున్నాయి. అర ఎకరా పండని భూమితో కుస్తీ పడుతూ జీవితాన్ని యీడుస్తున్న వెంకటసామికి కొత్తకమ్మా. వెదుళ్లూ కొని ఇల్లు బాగు చేయించుకోడం అసాధ్యమే అవుతూ వచ్చింది.

కుటుంబ భారం పెరిగిపోయి వంగి పోయాడు వెంకటసామి. మందు నీళ్ళయినా లేక జబ్బుతో మూల్గుతూ తాటి తడపల మంచాన్ని అంటుకుపోయిన భార్యా, మొగుడు చచ్చి సగం చచ్చి ఉన్న కోడలుపిల్లా, చిక్కి ఎముకల గూడుల్లా ఉన్న మనవడూ, మనవరాలూ వయసు మళ్ళిన వెంకటస్వామి రెక్కల కష్టం మీద బతుకుతున్నారు. చెట్టంత కొడుకు చచ్చిపోడంతో ఏనుగంత వెంకట

స్వామి పీనుగై పోయాడు.

తొలకరి ముందు ఇల్లు నేయించక పోతే, వర్షాకాలంలో ఇల్లు కూలిపోతుంది. తలదాచుకోడానికి కూడా చావు లేకుండా పోతుంది. అందుకే, కొండబాబు దగ్గరకు అప్పుకోసం వెళ్ళాలని అనుకుని ఆ వేళ ప్పుడు ఇంటికి వచ్చాడు.

ఇంచుమించు ఆరడుగుల ఎత్తు ఉన్న వెంకటస్వామి కూచుని పంచదూరినా జారిన వెదురు కొర్రు బుర్రకు తగిలి బొడిపి కట్టింది. రక్తం కూడా చిమ్మింది, 'మా అయ్య కోకంత పంచె బుట్టంత పాగా సుట్టుకునేడు. తలకు చుట్టుకోడానికి తుండు గుడ్డానేదు నాకు' అని చీకాకు పడ్డాడు.

లోతుకుపోయిన కడుపుల్తో దీనంగా నిద్రపోతున్న మనవణ్ణీ మనుమరాల్నీ చూసి విచారించాడు. బలుసాకు ఏరుతున్న ముసిల్దాన్ని చూసి బొడిపిని తడుము కుంటూ మూగవేదన పొందాడు. బలుసాకు ఏరుతున్న ముసిల్ది 'ఇది మాపిలి కిరా' అని వెంకటస్వామి మొహంలోకి చూస్తూ ఏడుపు నవ్వు నవ్వింది. 'మా అయ్య బలుసాకు మేకలకు మేపే ఓడు, ఇప్పుడిది మాంతింటన్నాము' అని గతం లోకి చూస్తూ అనుకున్నాడు,

దెబ్బ తగిలిన చోట నూనె బొట్టు రాసుకోడానిక్కి తలుపు తోసి గదిలో అడుగు పెట్టాడు. గిర్రున వెనక్కి తిరిగి తలుపు మూసాడు. 'నా కన్ను కాకి పొడవా' అని తిట్టుకున్నాడు, కొంచెం తెల్ల బడ్డా, బాగా నల్లగానే ఉన్న కోకచూరు మీద చూశాడు. అతని కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"ఎల్లాలి, ఎల్లాలి. ఎల్లక తప్పదు ఏది ఏదైనా ఎల్లాలి. ఎల్లాలి, ఎల్లాలి" అని వెంకటస్వామి అప్పుడు వెళ్ళడానికి స్థిరంగా నిశ్చయించుకుని సిద్ధపడ్డాడు. చిరిగిన చెప్పులు తొడుక్కుని పంచను వేలాడు తున్న తాటిరేకుల గొడుక్కి చేతికర్ర తగిలించి, ఆ గొడుగు బుర్ర మీద వేసు కుని వెంకటస్వామి బయలుదేరాడు.

• • •

ఎండ. మండుటెండ. నిప్పులు చెరుగు తూంది. గాలి, వేడి పొడిగాలి ధూళిని లేపు తూంది. పొద్దుపోతే కన్ను ఆనదని వెంకటస్వామి ఎండ వేళప్పుడే బయలు దేరాడు.

ఆ ఎండ ఎంతో ఎండగా, నిప్పులా వేడిగా ఉంది. అది దరిద్రుని గుండెల్లో మంటలా ఉంది. అది నిరాశా జీవుల నిస్పృహలా వేడి వేడిగా ఉంది. అది ఆరనిమంటలా భయంకరంగా ఉంది. అది చెంతకు చేరనిచ్చి చెయి వేయనీయని సరసిజాక్షి మనసులా క్రూరంగా ఉంది.

చెట్లలోని పక్షులు బిక్కచచ్చి చూస్తు న్నాయి. చెట్ల ఆకులు ఆఫీసర్లచే చీవాట్లు తిన్న గుమాస్తాల మొహాల్లా వాడిపోయి ఉన్నాయి.

ఆ గాలి వేడిగా, పొడిగా, వేడివేడిగా, పొడిపొడిగా, పరస్త్రీ కౌగిట్లోని గుబులులా



# కోకా-కోలా సాంగత్యం బ్రతుకే ఒక సారస్యం

ముచ్చటలాడే వేళ ముచ్చటైన వేళ! అట్టి వేళల కోకా-కోలా కలిగిస్తుంది కమ్మని వేడుక! ఉల్లాసం ఉత్తేజం కలిగించే సజీవమైన రుచి కోకా-కోలా రుచి. అందుకనే, త్రాగాలనిపిస్తుంది మళ్లీ మళ్లీ. త్రాగండి కోకా-కోలా...మళ్లీ కోకా-కోలా...మళ్లీ మళ్లీ కోకా-కోలా! ప్రపంచంలో నలుమూలలా, పెరిగిపోతోంది కోకా-కోలా త్రాగేవారి సంఖ్య రోజు రోజుకూ. కారణం: నేరవేర్పులంలో, కనివిని ఎరుగని కమ్మదనం, కోకా-కోలా కమ్మదనం!

Enjoy Coca-Cola

కోకా-కోలా, కోకా-కోలా కంపెనీవారి రిజిస్టరు చేయబడిన ట్రేడ్‌మార్కులు.

CMCC-15-162 TL

గుబులు గుబులుగా ఉంది.

ఆ తాడిచెట్లు, తమ నిరుపయోగమైన నీడల్ని చూసుకుని 'ఎత్తు ఒకటే ఉంటే సరిపోదు' అని చాటి చెబుతున్నాయ్.

నడుస్తున్న వెంకటస్వామి అడుగులు బరువుగా పడుతున్నాయ్. తొట్రుపాటు పడుతున్నాయి. కాళ్ళు వెనక్కే ఊగుతున్నాయి. కళ్ళు ఎర్రబడి మండుతున్నాయి. ప్రేగులు కరకర లాడుతున్నాయి. హృదయం బాధతో బరువుగా ఉంది. వేదనతో కుమిలిపోయి ఉంది. మనస్సు వికలంగా ఉంది, ఆలోచనను మనస్సును నిర్దాక్షిణ్యంగా హింసిస్తున్నాయి. చిత్రవధ చేస్తున్నాయి.

'....నా కొడుకు, నా కొడుకు, పిడుగునాటి మనిషి, మూడెకరాల భూమీ అప్పులోడి ఒసెం అయిపోయినాడు. బెంగపడిపోయి, పిడుగుపడ్డ సెట్టులా ఎండి సచ్చివాడు. ఆడు ఏం సేసినాడు? ఎయ్యి రూపాయిలు అప్పు తెచ్చినాడు. అది కాగితం మీద రెండు ఏలై కూకుంద. అది కోరుటులో మూడు రెట్లయిపోనాది. కోరుటువారికి ఒడ్డీ ఏపారం తెలీదు. దేవుడికీ తెలీదు. పీక్కోసి సేతుల్లో ఎట్టునట్టు——వున్న మూడెకరాల భూమీ అప్పులోడి సేతుల్లో ఎట్టేయని నాయం సెప్పింది. అంచేత నా కొడుకు అలాగే సేసినాడు. అంచేత ఆడు పిడుగు పడ్డ సెట్టులా ఎండి సచ్చినాడు. ఆడు ఎం తక్కువ సేసినాడు? ఎయ్యి రూపాయలే పుచ్చుకుని, రెండు ఏలు పుచ్చుకున్నట్లు కాగితం మీద రాసినాడే, ఒడ్డీకింద రూపాయికి సోలడు నువ్వులో, అడ్డెడు సెనక్కాయలో కొలిపినాడే, పండిన గింజలన్నీ ఆడికే అమ్మినాడే, మరి ఆడు సేసిన నేరం ఏటి? నాయం పచ్చం నిలబడ్డం! మాటకాడ నుంచి ఓటు దాకా అప్పులోడికే తాకట్టు ఎట్టాలా? ఆడి సేతుల్లో బొమ్మలా వుండాలా? ఆడు కోరుటులో దొంగ సాచ్చెం సెప్పమంటే సెప్పాలా? మరి దేవుడేటి సేత్తుండు? ఆడు ఏదైనా ఎందుకు సేయాలం? ఆటికేటి లోటుందని సేయాల? అప్పులోడు నా కొడుకును దొంగసాచ్చెం కోరుటులో సెప్పమన్నాడు ఈపాడు లోకంలో నాయం గెల్దనీ, సత్తెం ఆపదలు తెస్తాదనీ, దమరం ముప్పు మోసుకొత్తాదనీ నా కొడుక్కే తెల్దు.

'శా....శ్శా....సచ్చినా దొంగసాచ్చెం సెప్పేను, అని నా కొడుకు నాయంపచ్చం నిలబడ్డాడు. '....అయితే సావు' అని అప్పులోడు సెపించి, ఆ కాగితాన్ని కోరుటుకి పంపేసినాడు. డబ్బుతో సాచ్చాన్ని కొనేసుకునే రోజుల్లో నాయం ఎక్కడ నిలబడతాది? నా కొడుకు సచ్చినాడు, నాయం సచ్చింది. అయితే....ఇప్పుడు నాగతేమిటి" అని వెంకటస్వామి వ్యాకులిత చిత్తుడై బలికి తీసుకు వెళుతున్న జంతువులా వెళుతున్నాడు. ఇల్లూ - కోడలుపిల్లకోకా - వెంకటస్వామిని కొరడాతో తోలుతున్నాయి.

వెంకటస్వామి వెళ్లేసరికి కొండబాబు

చుక్కల్లో చంద్రుళ్ళా కూర్చున్నాడు. దేవతలలో దేవేంద్రుళ్ళా, రాక్షసులలో రావణుడిలా సభ తీర్చి ఉన్నాడు. అక్కడకు చాలామంది చేరారు. వాళ్ళు చాలా చాలా రకాల మనుషులు, చాలా చాలా రంగులు మార్చిన మనుషులు, చాలా చాలా పనులు చేసిన మనుషులు, చాలా చాలా పనులు చేయడానికి చేరిన మనషులు, గుళ్లో దేవుడ్నయినా, కొండమీద కోతినయినాకొట్టుకు రాగలిగిన మనుషులు అందులో వున్నారు. వాళ్లు రక రకాల మనుషులు. వాళ్లు రక రకాల నవ్వులు నవ్వుతున్నారు. రక రకాలుగా మాట్లాడుతున్నారు. రకరకాల ఆలోచనలు చేస్తున్నారు. 'ఇదంతా ఎలక్షన్‌ల గొడవ'అని వెంకటస్వామి వెంటనే గ్రహించాడు. అంచేత అక్కడకుకొంచెం దూరంగానే ఉండిపోయాడు.

ఆలోచించకుండా అర నిముషంలో అరవయ్యో వంతు కూడా వుండడం అసాధ్యం. అంచేత యజమాని దొంగతనం చేసినా ఆ కుక్క మొరగదు. అది తోకే ఆడిస్తుంది. అని వెంకటస్వామి అనుకున్నాడు. 'జీవితం అంటే డబ్బే అని నిశానీ ఎట్టీవొచ్చు' అని కూడా అనుకున్నాడు.

''నాయం, దరమం, సత్తెం- ఇయట్టుకు ఎలబడుతున్నారు ఈ నోకంలో తిండీ బట్టా లేక తిప్పలు పడుతుండ్రు. ఈటి పీకనొక్కి ముందుకు పోయినారు మారాజుల్లా గున్నోరు. అలాంటప్పుడ్ను ఇయ్యి భూమ్మీదెలా నిలబడగలవు? ఎలా నిలబడతాయి? మరి ఇయి నిలబడాలీ అంటే....'' వెంకటస్వామి అనుభవం ఆలోచించింది.

అక్కడ చేరిన వాళ్ళందరూ వెళ్ళిపోగానే వెంకటస్వామి కొండబాబును దర్శించాడు. వినయంగా వందనం చేశాడు. దీనంగా తన బాధలు చెప్పుకున్నాడు. మూడు వందల రూపాయలు అప్పు కావాలని జాలిగా విన్నవించుకున్నాడు.

అర ఎకరా పండని భూమి ఉన్న వాడికి మూడు వందలు అప్పా అని మొదట కొండబాబు విసురు విసిరాడు. తర్వాత 'పూరి పెద్దవు కదా' అని చిరునవ్వు నవ్వాడు. ఆ తర్వాత మూడు వందలేటి, ఐదు వందలు పట్టుకెళ్ళు అని హామీ ఇచ్చాడు. ఆ పిదప వెంకటస్వామిని గదిలోకి తీసుకుని వెళ్ళాడు.

*  *  *

''ఒద్దు బాబూ, ఒద్దు. నాకు అప్పు ఒద్దు. ఏది ఏదయినా అప్పు నాకు ఒద్దు. ఇల్లు కూలిపోయినా, కోడలికి కోక నేకపోయినా నీ అప్పు ఒద్దు నాకు. నన్ను నేను తాకట్టు ఎట్టుకోగలను. నా పూరిని తాకట్టు ఎట్టనేను. నేలతల్లి కంట్లో కారం జల్లనేను.........ఈ దేవుడు రాతి దేవుడు, ఈ మనుషులు.......'' అని వణుకుతున్న కంఠంతో అరుచుకుంటూ వెంకటస్వామి బయటకు వచ్చి తక్షణం ఇంటి ముఖం పట్టాడు.